నమస్తే తెలంగాణ

# వికారాబాద్

I హైదరాబాద్, గురువారం 9 మే 2024 VIKARABAD


- పరిపాలన అంటే పాన్‌డబ్బా నడపడం కాదు..
- నమ్మించి మోసం చేయడంలో చోటేభాయ్, బడేభాయ్ దిట్టలు
- ఆరు గ్యారెంటీల అమలు చేయని కాంగ్రెస్‌ను నిలదీయాలి
- జేబులో కత్తెర పెట్టుకుని తిరిగేవాన్ని జేబుదొంగనే అంటారు..
- కల్వకుర్తి రోడ్‌షోలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



ప్రజలకు అభివాదం చేస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, చిత్రంలో బీఆర్ఎస్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్



కల్వకుర్తిలో రోడ్‌షోకు భారీగా హాజరైన జనం

# కాంగ్రెస్, బీజేపీలను తరిమికొట్టాలి

కల్వకుర్తి, మే 8 : గ్యారెంటీల పేరుతో మోసం చేసిన కాంగ్రెస్‌ను, పేదల కడుపులు కొట్టి పెద్దల కడుపు నింపుతున్న బీజేపీలను ఎంపీ ఎన్నికల్లో తరిమికొట్టాలని బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. పేగులు మెడలో వేసుకుంటా.. కత్తెరను జేబులో పెట్టుకుని తిరుగుతా.. అంటూ రోత మాటలు, వెకిలి చేష్టలతో తెలంగాణ పరువు తీస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నటికీ పరిపాలన దక్షుడు కాలేడని ఎద్దేవా చేశారు. పరిపాలన అంటే పాన్‌డబ్బా నడపడం కాదని హితవు పలికారు. కల్వకుర్తిలోని హైదరాబాద్ చౌరస్తాలో మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అధ్యక్షతన జరిగిన రోడ్‌షోలో పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జి చాడ కిషన్‌రెడ్డి, ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి, మిషన్ భగీరథ కార్పొరేషన్ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్, ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌తో కలిసి ఆయన రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ ముందు చూపుతో ఆలోచిస్తూ ప్రజల సంక్షేమాన్ని కాంక్షిస్తూ, ఇచ్చిన హామీలను అమలు చేస్తూ, అభివృద్ధిలో రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లడమే పరిపాలన దక్షత అని, ఇది కేసీఆర్‌కు పుష్కలంగా ఉందన్నారు. ప్రజలను నమ్మించి మోసం చేసి అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డికి ఓట్లు అడిగే నైతిక హక్కులేదని మండిపడ్డారు. ఆరు గ్యారెంటీల్లో ఐదు గ్యారెంటీలు అమలు చేశామని హోర్డింగ్‌లతో ప్రచారం చేసుకుంటున్న సీఎం రేవంత్‌రెడ్డిని ప్రజలు నిలదీయాలి. అబద్ధపు హామీలు ఇచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ నాయకులు ఏ మోహం పెట్టుకుని గ్రామాల్లోకి ఓట్లు అడగటానికి వస్తున్నారని ప్రశ్నించారు. ఎన్నికల వరకు ఓడ మల్లన్న అంటూ ఎన్నో హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ ఎన్నికల య్యాక హామీలను విస్మరించి ప్రజలను బోడమల్లన్నలంటూ రాష్ట్రాన్ని లూటీ చేస్తున్నారన్నారు. పరిపాలనకు వచ్చే సరికి లంకె బిందెలు లేవు.. ఖాళీ బిందెలు మాత్రమే ఉన్నాయని అంటున్న రేవంత్‌రెడ్డికి కొండారెడ్డిపల్లిలోని పాత జ్ఞాపకాలు గుర్తుకు వస్తున్నాయేమో అంటూ సెటైర్లు వేశారు. మార్పు చేస్తానని అధికారంలోకి వచ్చిన రేవంత్ ప్రభుత్వం కాంగ్రెస్ మార్క్ దోపిడీకి తెర లేపిందని విమర్శించారు. కేసీఆర్ గురుకులాలను స్థాపిస్తే గురుకులాల కార్యదర్శిగా ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ విద్యాలయాలను సమర్థవంతంగా నిర్వహించి ఎంతో మంది విద్యార్థులను ప్రయోజకులను చేశారనే విషయాలను కేటీఆర్ గుర్తు చేశారు. నాగర్‌కర్నూల్‌తో పాటు రాష్ట్రంలో అన్ని పార్లమెంట్ స్థానాలలో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపిస్తే కాంగ్రెస్ పార్టీ మెడలు వంచి ఇచ్చిన హామీలను అమలు చేయించేలా చేస్తామన్నారు. ఈ ఎన్నికల్లో చోటేభాయ్ కాంగ్రెస్, బడేభాయ్ బీజేపీలతో బీఆర్ఎస్ పోటీపడుతున్నదన్నారు. బీఆర్ఎస్‌కు అండగా నిలువాల్సిన అవసరం ప్రజలకు ఉన్నదన్నారు. కృష్ణా జలాల్లో అన్యాయం జరుగుతున్నా కాంగ్రెస్ నోరు మెదపడం లేదన్నారు. పాలమూరు– రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వాలని ఎన్నిసార్లు మొర పెట్టుకున్నా కేంద్ర సర్కార్ పట్టించుకోలేదని, ఇప్పుడు మాత్రం ఓట్లు కావాలని అడుగుతున్నారని దుయ్యబట్టారు. కేసీఆర్ రాష్ట్రంలో సాగునీటి విప్లవం తీసుకువచ్చారన్నారు. అందులో భాగంగానే ప్రాజెక్టులు, రిజర్వాయర్లు నిర్మించిన సంగతిని గుర్తు చేశారు. కేవలం రాముడి గుడి నిర్మించామని.. ఓట్లు తమకే వేయాలని అంటున్న బీజేపీ, రాష్ట్రంలో కేసీఆర్ యాదాద్రి లక్ష్మీనర్సింహ స్వామి దేవాలయం నిర్మించారని, ఆధునిక దేవాలయాలైన సాగునీటి ప్రాజెక్టులను నిర్మించారని దీనికేమి సమాధానం చెబుతారని ప్రశ్నించారు. క్రూడాయిల్ ధర తగ్గినా ప్రజలపై 34 శాతం పన్నులు వేసిన బీజేపీ ప్రజలకు మేలు చేయకుండా అదానీ, అంబానీలకు సంపద దోచిపెడుతున్నదన్నారు. ఇదివరకు ఒక సారి మోసపోయారు, మరోసారి మోస పోవద్దని పిలుపునిచ్చారు. సమర్థవంతుడైన ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు ఓటు వేసి పార్లమెంట్‌కు పంపిస్తే పేదల గొంతుకగా పార్లమెంట్‌లో ఉంటాడని చెప్పారు.

**సమస్యల పరిష్కారానికి పోరాడుతా : అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్**

బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ ముందుగా బంజారా భాషలో గిరిజనులకు అభివాదం చేశారు. పార్లమెంట్‌కు పంపిస్తే దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న నాగర్‌కర్నూల్ జిల్లా సమస్యల పరిష్కారానికి పోరాడుతానని హామీ ఇచ్చారు. కేసీఆర్ వల్లనే రైతుబంధు, మిషన్ భగీరథ వంటి గొప్ప సంక్షేమ పథకాలు అమలయ్యాయని చెప్పారు. గురుకులాలను గొప్పగా తీర్చిదిద్దిన ఆదర్శవంతుడు కేసీఆర్ అని అన్నారు. రేవంత్‌రెడ్డి పాలనలో ప్రజలకు కన్నీళ్లు మిగిలాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్, బీజేపీలు ఇచ్చే మోసపూరిత హామీలను నమ్మవద్దని పిలుపునిచ్చారు. బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగం రద్దవుతుందని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ రిజర్వేషన్లు రద్దు అవుతాయని, రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన అవసరం మనందరిపై ఉందన్నారు. మే 13న జరుగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కారుగుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. రోడ్‌షోలో మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, జడ్పీటీసీ సభ్యులు విజితారెడ్డి, దశరథనాయక్, వైస్‌ఎంపీపీ గోవర్ధన్, విజయ్‌గౌడ్, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సబితారెడ్డి, చిత్రంలో అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్, శాసనమండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్ తదితరులు

- మెట్రో, ఫార్మాసిటీలను ఎందుకు రద్దుచేశారో చెప్పాలి
- పదేండ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ చేవెళ్లకు చేసింది గుండు సున్న
- కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించాలి
- కందుకూరు రోడ్ షోలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి



కందుకూరులో జరిగిన రోడ్‌షోకు భారీగా హాజరైన జనం

# గ్యారెంటీలు ఎగ్గొట్టిన కాంగ్రెస్‌ను చిత్తుగా ఓడిద్దాం

కందుకూరు/బడంగ్‌పేట, మే 8 : ఈ ప్రాంతానికి తీవ్ర అన్యాయం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. ఎందుకు నీకు చేవెళ్ల ప్రజలు ఓటు వేయాలని ప్రశ్నించారు. బీసీలు అంతా ఏకమై బీసీ బిడ్డ కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. బుధవారం రాత్రి కందుకూరులో హైదరాబాద్, శ్రీశైలం రహదారితో పాటు మహేశ్వరం మండల కేంద్రంలో చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్, శాసన మండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్‌లతో కలిసి రోడ్ షోలు నిర్వహించారు. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ మెట్రో, ఫార్మాసిటీలను ఎందుకు రద్దుచేశారని ప్రశ్నించారు. ఆడబిడ్డల పట్ల చులకనగా మాట్లాడుతున్నారని, తన పట్ల ఇష్టాను సారంగా మాట్లాడడం తగదని మండిపడ్డారు. తాను రాత్రి సమయంలో బీజేపీకి, ఉదయం సమయంలో బీఆర్ఎస్ పార్టీకి ప్రచారం చేస్తున్నట్లు ఆరోపిస్తున్నారని.. బీజేపీకి ప్రచారం చేయాల్సిన గతి పట్టలేదని తెలిపారు. రైతుల రుణమాఫీ, రూ.500లకు గ్యాస్, రూ.4వేల పింఛన్, ప్రతి ఇంట్లో మహిళకు రూ.2500, 24 గంటల విద్యుత్ ఎగ్గొట్టినందుకు కాంగ్రెస్‌కు ఓటేయాలా.. అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చేసిన అభివృద్ధి ప్రజల ముందు కదలాడుతుందన్నారు. తుక్కుగూడకు అనేక కంపెనీలు తీసుకువచ్చినట్లు తెలిపారు. కరెంటు ఎప్పుడు పోతుందో.. ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి నెలకొన్నదని తెలిపారు. బీజేపీ కేంద్రంలో అధికారంలో ఉండి చేవెళ్లకు చేసింది గుండు సున్న అని విమర్శించారు. మతం, కులం పేరు మీద ఓట్లు అడుగుతున్న బీజేపీకి, హామీలను ఎగ్గొట్టిన కాంగ్రెస్ పార్టీలకు ప్రజలు బుద్ధి చెప్పాలన్నారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో ఎస్సీ కమిషన్ మాజీ మెంబర్ నర్సింహ, మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు జయేందర్ ముదిరాజ్, మార్కెట్ మాజీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, మేఘనాథ్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ చంద్రశేఖర్, వైస్ చైర్మన్ గోపిరెడ్డి విజేందర్‌రెడ్డి, సీనియర్ నేతలు లక్ష్మీనర్సింహరెడ్డి, దశరథ, అంజయ్యగౌడ్, బాల్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు సురుసాని రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మోసపోయి.. గోసపడుతున్నాం..

మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి

ఇబ్రహీంపట్నంలో భారీ రోడ్‌షో, బహిరంగసభ

కాంగ్రెస్ నాయకుల అరాచకం పెరిగిపోయింది : మంచిరెడ్డి కిషన్‌రెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి, చిత్రంలో అభ్యర్థి క్యామ మల్లేశ్, ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి యాదగిరిరెడ్డి

ఇబ్రహీంపట్నం, మే 8 : కాంగ్రెస్ పార్టీ మోసపూరిత హామీలతో మోసపోయి..గోస పడుతునన్నామని.. ఈ లోక్‌సభ ఎన్నికల్లోనైనా తప్పును సరిదిద్దుకుని బీఆర్ఎస్‌పార్టీ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్‌ను గెలిపించుకుందామని బీఆర్ఎస్ ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, బీఆర్ఎస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. బుధవారం ఇబ్రహీంపట్నంలో క్యామ మల్లేశ్‌కు మద్దతుగా మార్కెట్‌యార్డు నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదు నెలలు దాటినా ఎన్నికల ముందు ఇచ్చిన ఒక్క హామీని కూడా నెరవేర్చలేదని ఆరోపించారు. ముఖ్యమంత్రే వీధిరౌడీలా ప్రవరిస్తూ ప్రతిపక్షనేత కేసీఆర్‌ను దూషిస్తున్నారని మండిపడ్డారు. మరోసారి మోసపోకుండా ఈ ఎన్నికల్లో బీసీ నాయకుడైన క్యామ మల్లేశ్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుందామని ప్రజలు, బీఆర్ఎస్ శ్రేణులకు సూ చించారు.

**కాంగ్రెస్ నాయకుల అరాచకాలు పెరిగాయి..**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోని వచ్చి ఐదు నెలలు దాటినా తాను మంజూరు చేయించిన నిధులను ఖర్చుపెట్టే స్థితిలో లేదని బీఆర్ఎస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. హామీల అమల్లో విఫలమైందని.. సమస్యలు చెప్పుకొందామంటే స్థానిక ఎమ్మెల్యే అందుబాటులో ఉండడంలేదని ప్రజలు ఇబ్బందిపడుతు న్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ రావడంతోనే రాష్ట్రంలో కరువువచ్చిందని, అయినా పట్టించుకున్న నాథుడే లేడన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్ రెడ్డి, దండెం రాంరెడ్డి, వంగేటి లక్ష్మారెడ్డి, సత్తువెంకట రమణారెడ్డి, ఎంపీపీ కృపేశ్, నాయకులు రాంరెడ్డి, బుగ్గరాములు, వెంకట్‌రెడ్డి, జంగయ్య, కళమ్మ, రవీందర్‌రెడ్డి, రాజు, మొద్దు అంజిరెడ్డి, అరవింద్, కౌన్సిలర్లు, నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**ఆశీర్వదిస్తే.. అందుబాటులో ఉంటా..**

ఈ ప్రాంతవాసిని.. మీలో ఒకడిని.. ఆశీర్వదించి గెలిపిస్తే మీకు అందుబాటులో ఉంటా. బడుగు, బలహీన వర్గాలకు బీఆర్ఎస్ అధిక ప్రాధాన్యమిచ్చింది. కాంగ్రెస్, బీజేపీలు బలహీన వర్గాలను విస్మరించాయి. ప్రతి ఒక్కరూ రాజకీయాలకతీతంగా గెలిపించాలి. అధికారంలోకి వచ్చి ఐదు నెలలైనా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల్లో ఒక్క దానిని కూడా నెరవేర్చలేదు. కాంగ్రెస్ నాయకులకు అహంకారం పెరిగిపోయింది.. వారికి బుద్ధి చెప్పాలంటే ఈ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేయాలి. భువనగిరి కాంగ్రెస్ అభ్యర్థిపై ఆదిబట్ల ఠాణా పరిధిలో కేసు నమోదైంది. అలాంటి వ్యక్తులకు అధికారమిస్తే ఈ ప్రాంతాన్ని మరింత నాశనం చేస్తారు. కాంగ్రెస్, బీజేపీల మధ్య లోపాయికారి ఒప్పందం కుదిరింది. యాచారం ఎంపీపీ, భువనగిరి మున్సిపల్ చైర్మన్ ఎన్నికల్లో ఈ రెండు పార్టీలు పొత్తుపెట్టుకున్నాయి. ఇలాంటి పార్టీలకు అవకాశం ఇవ్వొద్దు.

-క్యామ మల్లేశ్, బీఆర్ఎస్ అభ్యర్థి



ఇబ్రహీంపట్నం : రోడ్‌షోకు భారీగా హాజరైన జనం